అరచేతిలో గ్లోబు

ప్రియమైన నీరజక్కయ్యా, నమస్కారం. నీ ఉత్తరం చేరింది. నీకీ ఉత్తరాలు రాసే బెడద తప్పడంకోసం ఇంట్లో ఫోన్ పెట్టించుకోలేని నా అశక్తతకు మన్నించు. అశక్తత మాట అటుంచి, కాలంతో పోటీపడి ఫోన్‌లో ముక్తసరిగా మాట్లాడడం కన్నా, ఉత్తరాల్లో నింపాదిగా మనసువిప్పి విషయ నివేదన చేసుకోవడమంటేనే నాకిష్టం. అన్నట్టు నువ్వు 'ట్రావెలాగ్ రాశావా? రాస్తున్నావా? అసలు రాసే ఉద్దేశం ఉందా?' అని నిలదీసి అడిగావు. అక్కయ్యా నువ్వు కోపగించుకోకపోతే నేనొకమాట చెబుతాను. మాటల్లోగానీ, చేతల్లోగానీ పదిమందినీ అనుసరిస్తూ నడుచుకుంటేనే మనకు భద్రత. లోకంలో ఉన్న నిశ్చితాభిప్రాయా లకు వ్యతిరేకంగా ఎవడైనా మాట్లాడితే, వాడికి మునుపటికెన్నడో భూమి గుండ్రంగా ఉందని చెప్పిన శాస్త్రవేత్తకు జరిగిన సత్కారమే జరుగుతుంది. భారతీయ నాగరికతకు ప్రస్తుతం అమెరికా భజన అన్నది కలికితురాయిగా కుదిరిపోయింది. 'మా పెదనాన్నగారి అల్లుడికి వేలువిడిచిన తమ్ముడు స్టేట్స్‌లో వున్నా'డని చెప్పుకోవడం చాలా గొప్ప. "నా కొడుకు జాబు రాసినాడమ్మా. నలభై ఏడో అంతస్తులో ఉన్నవాడి ఆఫీసులో కూచుని రాసినాడంట' అని చెప్పుకోవడం మరింత గొప్ప.

ఇటీవల నేను, కొడుకూ కోడలూ, కూతురూ అల్లుడూ కూడా అమెరికాలో ఉన్న ఓ పెద్దమనిషితో మాట్లాడుతూ ఉండి, బుద్ధిమాలి నా అమెరికా అభిప్రాయాలు కొన్నింటిని బయట పెట్టడానికి ప్రయత్నించాను. మనిషి అగ్రహోదగ్రుడైపోవడమంటే ఏమిటో అప్పుడే తెలిసింది.

'భారతదేశం గూడా ఒక దేశమా? భారతీయులుగూడ మనుషులేనా? వీళ్ళు తింటున్నది తిండేనా? బతుకుతున్నది బతుకేనా?' అన్నట్టుగా ఆయన ఛీత్కారప్రాయంగా నావైపు చూశాడు.

'చాల్లేవయ్యా నువ్వున్నూ, నీ మిడిమిడి జ్ఞానమున్నూ! నక్క ఎక్కడ, నాగలోకమెక్కడ?' అంటూ దులిపిపారేశాడు. అంతెందుకు, ఏదో డెప్యుటేషన్ మీద స్టేట్స్‌లో రెండేళ్ళుండి వచ్చిన వారి వంశాంకురం – అయిదేళ్ళ కుర్రాడు, 'డర్టీ ఇండియా! మనకొద్దే వద్దు. లెటజ్ గో టు అట్లాంటా మమ్మీ' అంటూ తల్లితండ్రుల్ని మురిపించడం చూసి నేను నా విస్మయాన్ని దిగమింగుకున్నాను. మన మాట, మన తిండి, మన గాలి, మన నీరు మొదలైన వాటిపట్ల చాపకింద నీరులా ఇలా అసహ్యం విస్తరించడం చూస్తుంటే నాబోటి అర్భకులకు మతిపోతూ వుంది. ఈ పరిస్థితిలో నేనేం ట్రావెలాగ్ రాయగలను చెప్పు. లేదంటే నిర్భయంగా నా అభిప్రాయాలు బయటపెట్టుకోవడానికి నువ్వొక్క దానివైనా వున్నావు. అదైనా ఎంత అదృష్టం!

రాకపోకలకు చార్జీలు భరించి, అక్కడ ఆతిథ్యమివ్వగలిగిన వాళ్ళుగూడా సమకూరితే మామూలు వారపుసంతకు వెళ్ళి ఎరుగని వాడుగూడా అమెరికా వెళ్లి రావచ్చు. ఒకానొక కళలోకొంత ప్రవేశమో, అభినివేశమో కలిగి ఉండడం నాకు సమకూరిన గొప్ప అర్హతైపోయింది.

సంయుక్త రాష్ట్రాలలోని తెలుగు సాంస్కృతిక సంస్థల సమాఖ్య ఒకటి అన్ని సదుపాయాలకూ హామీ ఇచ్చి, వివిధ నగరాల్లో వేణుగాన కచ్చేరీలు ఏర్పాటు చేయకపోతే నాది అమెరికా వెళ్ళివచ్చే ముఖం గాదు. ఒకమాట చెప్పనా అక్కయ్యా! ఈ ప్రయాణాని కంతా అంతర్వాహినిగా ఉన్నది ఎట్లాగైనా నిన్ను కలుసుకోవాలన్న సంకల్పమే! అప్పటికి నువ్వుత్తరం రాసి అయిదారేళ్ళయిపోయింది. నేను రాసిన ఉత్తరాలేమో 'అడ్రస్ జాడ తెలియడం లే'దన్న రిమార్కుతో తిరిగొచ్చేశాయి. మనకు కావలసినవాళ్లు విశాల ప్రపంచంలో ఎక్కడో ఒకచోట ఉన్నారనుకోవడంలో గొప్ప సంతృప్తి ఉంది. హఠాత్తుగా అంతర్థానమైపోయి, ఆ తరువాత వాళ్ళ అజాపజా తెలియపోతే ఏమనుకోవాలి? ఈ విషయం జ్ఞప్తికొచ్చినప్పుడల్లా నాకు ఏడుపొస్తుండేది. చిన్నప్పుడే తల్లి పోయిందా, తండ్రి మారు మనువు చేసుకున్నాడా, సొంత ఇంట్లోనే నేను పరాయివాడినైపోయానా, అప్పట్లో పెద్దమ్మ ఆదరణ దొరక్కపోతే నా బతుకేమైపోయేదో?

ఆమె నన్ను నెల్లూరు తీసుకొచ్చేసింది. ఆమె ఒళ్లో నువ్వు, నీ ఒళ్ళో నేను కూర్చుని తీయించుకున్న ఫొటో నీకు గుర్తుందా అక్కయ్యా 'ప్రతి ఏడాదీ సూళ్ళూరుపేట వెళ్ళి చెంగాళమ్మను సేవించుకునేవాళ్ళం. వెంకటగిరిలో నాటకాలు చూసేవాళ్ళం. వారానికి రెండుమూడుసార్లయినా రంగనాయకస్వామిని దర్శించేవాళ్ళం. పెన్నానది ఇసుకతిన్నెల్లో బొమ్మరిళ్ళు కట్టుకునేవాళ్ళం. వంతెనపైన వెళ్ళే రైల్లోని ప్రయాణికులకు చేతులూపుతూ వీడ్కోలు చెప్పేవాళ్ళం. ఆ మాటకొస్తే నా చిన్ననాటి స్మృతులన్నీ నీతో ముడిపడినవేకదా. అలాంటి నువ్వు నీ అతీగతీ గురించి ఒక చిన్న క్లూ అయినా మిగల్చకుండా అజ్ఞాతంలోకి జారిపోతావా? తలచుకున్న కొద్దీ నీపైన నాకు కోపంగూడా వస్తుండేది. జాన్ కెనడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగి అమెరికా నేలపైన తొలి అడుగులు వేస్తుండగా నా మనసులో మెదలినవన్నీ నిన్ను గురించిన జ్ఞాపకాలే.

'ఓరుగంటి నీరజాదేవి అండ్ భూపతిరాజా ఒక కూతురుంటుంది వాళ్ళకు. పిట్స్‌బర్గ్ దగ్గర సిల్వర్‌టన్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఉండేవాళ్ళు. ఏమండీ, వాళ్ల పేర్లు ఎక్కడైనా విన్నారా? ఆచూకీ ఏమైనా చెప్పగలరా?' అంటూ ఓ రికార్డు తయారుచేసి మనసులో పదిలపరచుకున్నాను. ఎక్కడికి వెళ్ళినా, ఎవరిని కలుసుకున్నా 'తప్పిపోయిన అక్కయ్య'గా నీ ప్రసక్తి తెస్తూ వచ్చాను. 'ఊఁహూ! తెలియదండీ. అలాంటి పేర్లే విన్నట్లు లేదండీ' అన్న జవాబుతో నా తల దిమ్మదిరిగిపోతూ వచ్చింది.

అమెరికాలో నా పర్యటన చికాగో నగరంనుంచి ప్రారంభమైంది. డల్లాస్, ఆస్టిన్, హ్యూస్టన్ నగరాలు కేంద్రంగా టెక్సాస్ రాష్ట్రంలో చాలా ప్రదేశాలు చూశాను. కెనడా వీసా సంపాదించి అట్లావా, టొరంటో పట్టణాలకు వెళ్ళాను. తిరిగివచ్చి డెట్రాయిడ్‌లో కొన్నాళ్ళుండి నయాగరా మీదుగా బఫెలో చేరుకున్నాను. అక్కయ్యా! ఆ ఊళ్ల పేర్లూ, ఆ ప్రయాణాలు నీకు తెలియనివా? వాటిని గురించి ఏకరవుపెడుతూ నిన్ను విసిగించను. అయితే, బయటికి చెప్పుకోవడానికి వెనుకాడుతూ, నా మనసులోనే దాచుకున్న అభిప్రాయాలను నీతో పంచుకోక తప్పదు. ఎన్నో ఆకాశహర్మ్యాలు, ఎన్నో రోడ్లు, ఎన్నో డిపార్ట్‌మెంట్ స్టోర్లు – అన్నీ ఒకదానికొకటి డిటోగా కానరావడమే అమెరికా నగరాల ప్రత్యేకత అనుకుంటాను.

ఎప్పుడూ తలుపులు మూసి ఉండడం వల్ల స్టిల్ చిత్తరువులా కానవచ్చే ఇళ్లు, లోపల ఎవరున్నారో తెలియకుండా చీమలబారుల్లా సాగిపోయే కార్లు, పాదచారులు నడయాడని రోడ్లు నాకు విసుగుదలను కలిగించాయనే చెప్పాలి. తెలుగు రక్తం పంచుకుపుట్టి అమెరికా నేలపైన నివసిస్తున్న అన్నదమ్ముళ్ల, అక్కచెల్లెళ్ల జీవన విధానమే నా పరిశీలనకు తరిగిపోని ముడివస్తువుగా పరిణమించింది. మామూలుగా నేను భార్యాభర్తలిద్దరూ ఉద్యోగుల్లా ఉన్నవారి ఇళ్ళలోనే బస చేశాను.

వాళ్ళు ఆరింటికల్లా నిద్ర లేస్తారు. ఇంటిని తుడిచిపెట్టి, బోకులు కడిగిపెట్టి, స్నానపానాలు ముగించి, మొక్కజొన్న పిండి ముక్కలు పాలల్లో కలుపుకొని చద్దన్నం తిన్నట్టు గబగబా నోట్లో వేసుకుని చెరొక కారుపైన చెరొక దిశగా ఉద్యోగ విధులకు వెళ్ళిపోతారు.

ఆఫీసు పక్షులన్నీ గూళ్ళు చేరుకునే అపర సంజవేళల్లో చీమల నడకతో పోటీ పడినట్టు ముందూ, వెనకా సాగే కార్లకు అనుగుణ్యంగా తమ కారు వేగాన్ని సర్దుకుంటూ సాయంకాలం ఏడింటికిగాని ఇల్లు చేరుకోలేరు. రిమోట్ కంట్రోల్‌తో తలుపులు తెరిపించుకుని పేరు పెట్టి బిడ్డల్ని బిగ్గరగా పిలుస్తూ ఇంట్లోకి దూసుకొస్తారు. అదంతా వాళ్ళ చాపల్యం మాత్రమేగాని ఆవేళప్పుడు అమెరికన్ పడుచువాళ్ళెక్కడైనా ఇంట్లో ఉంటారా! భార్యాభర్తలకదంతా ఆలోచించుకునే తీరిక మాత్రం ఎక్కడిది? డ్రస్ మార్చుకుని వెళ్ళి వంటగదిలో పడతారు. వేడి వేడిగా తయారుచేసుకున్న ఖాద్య పదార్థాలను ఆవురావురంటూ తినేస్తారు. రోజుకంతా ఈ ఏకభోజనమే వాళ్ళు నోచుకున్న మృష్టాన్నం. భోజనానంతరం ఉత్తరాలు చూసుకోవడం, ఫోన్‌కాల్స్ చెయ్యడం 64 పేజీల దినపత్రికను ఒకసారి తిరగెయ్యడం - ఇంతటితో ఆరోజుకని దాచిపెట్టుకున్న జవసత్త్వాలన్నీ ఖర్చయిపోగా, నిద్రలో నడచినట్టుగా వెళ్ళి సొమ్మసిల్లినట్టుగా పడకపైన వాలిపోతారు. స్థానిక హోటళ్ళలో ఇంగ్లాండు దేశపు డాగ్ హెడ్స్‌గానీ, ఇటలీ దేశపు పిజ్జులుగానీ, చైనా దేశపు చేపల వేపుళ్ళుగానీ మైసవి, అర్ధరాత్రికెప్పుడో ఇల్లు చేరుకుంటూ టీవీలో భయంకర, బీభత్స దృశ్యాలను, కర్ణ కఠోర ఘోరధ్వనులను వసంతవైభవాలుగా, కోకిలాలాపాలుగా ఆస్వాదిస్తూ, తెల్లవారుజామున ఎప్పుడో నిద్రలోకి జారుకునే వంశోద్ధారకులకు మధ్యాహ్నం పదకొండుకో, పన్నెండుకోగానీ తెల్లవారదు. ఆ లెక్కన తల్లితండ్రులు, వారి బిడ్డలు ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం సెలవు రోజుల్లో మాత్రమే ఒనగూడే అపురూప సన్నివేశమని చెప్పుకోవచ్చు.

'అమెరికా జీవితం మీపైన నెరపిన ప్రభావాల్లో ప్రముఖమైనదేది?' అని నేనొక నడివయసు డాక్టరమ్మనడిగాను.

'తెలియడం లేదా నాయనా. ఇదిగో, ఇలా డబ్బును మింట్ చేసే యంత్రాలుగా మార్చడం' అంటూ ఆమె బదులిచ్చింది. భవిష్యత్తును గురించిన భయాలు ఆమె కళ్ళల్లో చీకటి నీడల్లా పాకడం గమనిస్తూ నేను భయపడి పోయాను. 'అదేమిటండీ! కష్టాలు పడితేనేగదా సుఖాలు?' అంటూ ఓదార్చబోయాను. ఆమె నవ్వింది. ఆ నవ్వు ఏడవలేక నవ్వినట్టుంది.

'పోనీ, మన దేశానికి తిరిగొచ్చేయగూడదా? పరమ పావని భారతమాత కోట్లాదిమందిని మోస్తూనే ఉందిగదా, మీరు తిరిగొస్తే ఆమెకు బరువైపోతారా?' అన్నాను.

'ఎందుకులే బాబూ. ఇప్పుడక్కడి బంధువులతో మాకు కోల్డ్‌వార్ జరుగుతోంది. ఇక్కడ అమెరికాలో తమకో డబ్బులు కాసే చెట్టుందనీ, దీన్ని అక్కడినుంచి కదిలిస్తే డబ్బులు వెళ్ళి తమ ఒడిలో రాలిపోవాలని ఆశించడం వాళ్ళకు రివాజైపోయింది. బాధలూ, కష్టాలూ, దుఃఖాలూ ఉత్తరాల నిండా పెట్టి పంపిస్తే ఎంతకాలమని ఆ ఏడుపు కుండలతో అభిషేకించుకోగలం? ఇదిగో అక్షయపాత్ర. ఎవరికి కావలసినంత వారు తీసుకోవచ్చు ననగల పరిస్థితి ఉంటే మేము ఇండియాకు రావచ్చు. అలా జరగకపోతే మేము నయాగరాలో దూకినా వాళ్ళు పట్టించుకోరు. తమ్ముడూ రంగశాయీ! ప్రపంచాన్ని నడిపేది మానవతా సంబంధాలనేవాడు పరమ మూర్ఖుడు. ఆర్థిక సూత్రాలేనన్నవాడు మహా మేధావి. నువ్వీ అమెరికా దేశంలో ఏ నగరానికైనా వెళ్ళిచూడు. యూనివర్శిటీల్లో, ఫ్యాక్టరీల్లో, ఆస్పత్రుల్లో తదితర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్న నూనూగు మీసాల భారతీయ యువకులు మనుషులుగా ఉంటూ యంత్రాలుగా మారిపోతున్న దశలో నీకు కనిపిస్తారు. వారంలో అయిదురోజుల పొడుగునా ఊపిరి తిప్పుకోకుండా పనిచేస్తూ బట్టలుతుక్కోవడం, ఇస్త్రీ చేసుకోవడం, కావలసిన వస్తువులేవైనా కొనుక్కోవడం మొదలైన పనులకు శనివారాలు కేటాయించి, ఆదివారాల్లో ఏ స్నేహితుడినో కలుసుకోవడానికి వందలకొలదీ మైళ్ళు కారులో వెళ్ళొస్తూ అద్దాల గదిలో ఊరపిచ్చుకల్లా బందీలై బతుకుతున్న యువకుల్ని చూసి నువ్వు జాలి పడకుండా ఉండగలవా? రెండు వారాల సెలవులో స్వదేశానికి వెళ్ళి, అప్పటికే తల్లితండ్రులు చూసిపెట్టిన సంబంధాల్లో ఒకటి ఎన్నిక చేసుకుని, సాంప్రదాయిక వివాహ తతంగంతో పాటుగా సర్కారు రిజిస్ట్రేషన్ పత్రాలనుగూడా సంపాదించుకుని, వీలైతే కొత్త భార్యతోను, లేకుంటే ఆరు నెలల్లో తప్పకుండా తిరిగివచ్చి తీసుకెళ్తానన్న వాగ్దానంతోనూ చక్కా ఆకాశమార్గం పట్టేవాళ్ళ దయనీయ పరిస్థితి నీ గుండెల్ని కలచివేయడం లేదా! భూమ్యాకర్షణ శక్తిని దాటుకుని అంతరిక్షంలోకి దూసుకుపోయే రాకెట్లలా, తమ బిడ్డలు మాతృ దేశాభిమానాన్ని వదలుకుని మరొక సమాజపు మానసపుత్రులైపోయే ప్రమాదాన్ని మనవాళ్ళెందుకు గుర్తించరు? సుదూర దేశంలో తమ బిడ్డల ఉనికికి, మనికిగల ఏకైక దాఖలా ఫోన్‌పైన జరిగే సంభాషణలుగా మాత్రమే పరిణమించిన తర్వాత, ఇక కలిగే ఆనందమంతా వాళ్ళు పంపే డాలర్లవల్లనే గదా. తల్లితండ్రులకు, వారి బిడ్డలకు మధ్యగల అనుబంధాలు సైతం ఆర్థిక సూత్రాల చేతుల్లోకి వెళ్ళిపోతున్న ఈ మహామారీచ మానవ నాగరికతా యంత్రంలో మనమందరం మరచీలలు కావలసిందేనా? ఈ అనర్థాన్ని గురించి మీ సామాజిక శాస్త్రవేత్తలు మీకేమీ చెప్పడంలేదా? మీ కవితలు, కథలు, నవలలు హెచ్చరించడంలేదా? అదంతా అలా ఉంచు. నా పరిస్థితిని గమనించావా నువ్వు? ఎట్లాగూ నువ్వు వంటింట్లో కుందేల్లా దొరికిపోయావుగదా! ప్రతిరోజూ ఒక గంటసేపు నీ వేణు నాదనం వినాలన్న కోరిక, అదెంత సులభసాధ్యమైనా నెరవేరిందా? ఇదిగో ఆ గదిలో నేను షిప్‌పైన తెలుగు పుస్తకాలు విప్పి చూసే దిక్కులేకుండా కట్టలుకట్టలుగా పడి ఉండడం నువ్వు గుర్తించలేదా? తాకిందల్లా బంగారమైపోయే మైదాను రాజుకన్నా ఏం సుఖసంతోషాలున్నాయయ్యా మాకు? నాయనా రంగశాయీ, నామాట ఒకటి ఆలకిస్తావా బాబూ, డబ్బుకోసం కావలిస్తే నువ్వు కచ్చేరీలు చేసుకో. కానీ, ఏ

చెరువు కట్టపైన్నో, ఏటి ఇసుకతిన్నెలపైన్నో, ఏ రమణీయ ప్రకృతి స్థలాల్లోనో కూచుని నీ ఆత్మానందంకోసం ఎప్పుడైతే నీ వేణువునుంచి రాగాలు, నాదాలు కురిపిస్తావో, అదే నీ జీవితంలో బతికిన క్షణాలుగా భావించు.

ఆఖరు మజిలీ న్యూయార్కు. సోమవారం సాయంకాలపు విమానంలో స్వదేశానికి బయద్దేరవలసి ఉండగా శనివారం నాడు నగరం శివార్లలో నా కార్యక్రమంతోపాటు వనభోజనాలు గూడా ఏర్పాటు చేశారు. భోజనానంతరం విశ్రాంతి తీసుకుంటున్న పౌరబృందాల నడుమ నేను ఆఖరుసారిగా నా అరిగిపోయిన రికార్డును ఆన్ చేశాను. సమూహాలకు దూరంగా కొంచెం వైదొలగి కూర్చున్న ఓ నలభై ఏళ్ళ భద్ర మహిళ నావైపు సాగి వచ్చింది.

'ఏమిటండీ! ఏమన్నారు? ఓరుగంటి నీరజాదేవా? నెల్లూరివారేకదూ? హైస్కూలు టీచరు. మాకు సోషల్ స్టడీస్‌కు వస్తుండేది. ఆవిడగారెక్కడున్నదీ నేను చెప్పగలను.'

నా ఆనందానికి అవధులు లేకపోయింది. 'అమ్మా, మీకు పదివేల నమస్కారాలు. చిమ్మచీకటిలోకి చొచ్చుకవచ్చిన కాంతికిరణంలా ఉన్నారు నాకు. ఏదీ చెప్పండి, అడ్రస్ రాసుకుంటాను' అన్నాను.

'ఉండండి సార్! వివరంగా చెప్పనివ్వండి' అంటూ ఆమె నన్ను జనాంతికంగా తీసుకెళ్ళింది. 'ఆ ఊరిపేరు ఓల్డ్ హైడ్ పార్కు. తెలిసినవాళ్ళెవరో ఉన్నారని మావారు ఏడాదిక్రితం నన్నావూరికి తీసుకెళ్ళారు.

అది చిన్న బస్తీ. అందులో తెలుగు కుటుంబాలు అయిదారున్నట్టు తెలిసింది. ఆ ఇంటి గృహిణి వాళ్ళ వివరాలు చెబుతుండగా నీరజాదేవిగారి పేరు వినిపించి ఉలికిపడ్డాను.

'ఇంటిపేరు ఓరుగంటివారేనా' అని అడిగి తెలుసుకున్నాను. నంబర్ తీసుకుని వెంటనే ఫోన్ చేశాను.

'మేడమ్ నా పేరు పద్మరాణి. మాదీ నెల్లూరే. మీ స్టూడెంటుని. మూడేళ్ళుగా న్యూయార్కులో ఉంటున్నాను. మిత్రుల్ని కలుసుకోవడంకోసం ఈరోజు ఉదయమే ఇక్కడికి వచ్చాను. మీరిక్కడ ఉన్నట్టు తెలిసింది. అభ్యంతరం లేకపోతే ఇప్పుడే వచ్చి కలుసు కుంటా'నన్నాను.

ఒక నిమిషం నిశ్శబ్దం. ఆ తర్వాత ఆమె గొంతు పెకలింది. 'మంచిదమ్మాయ్. నేనర్జంటుగా ఒక చోటికి వెళ్తున్నాను. తిరిగి రాగానే కబురు చేస్తాను' అంటూ ఆమె టకీమని రిసీవర్ పెట్టేసింది. అయితే, ఆమెకా ఉద్దేశం లేదని నాకు స్పష్టంగా తెలిసిపోయింది. మళ్ళీ పలకరించదలచుకుంటే, నేనెక్కడున్నానో ఏమిటో తెలుసుకోవద్దా? కారణం ఏదైతేనేమి, ఆమె పూర్వ పరిచయాలను, స్నేహాలను పునరుద్ధరించుకునే ధ్యాస లేకుండా అజ్ఞాతంగా ఉండిపోదలచుకుంటున్నదని నేను గ్రహించగలిగాను.

పద్మరాణి మూలంగా నాకు నీ ఫోన్ నంబర్ తెలిసింది. ఆ మాత్రం ఆధారం దొరకడమైనా అదెంత భాగ్యం. అమెరికాలో ఫోన్ నంబర్ దొరకడమంటే ఆలీబాబాకు గుహను తెరిచే మంత్రం తెలిసినట్టేగదా.

తిరిగి వెళ్ళగానే నాకాశ్రయమిచ్చిన అభిమాని ఇంట్లోనుంచి నీకు ఫోన్ చేశాను. అలా చేస్తున్నప్పుడు నేనుగూడా పద్మరాణి చేస్తున్న పొరపాటే చేస్తున్నానన్న విషయం నా మొద్దు బుర్రకు తోచిందే గాదు. నంబర్ డయల్ చేయగానే నీ గొంతు వినిపించింది. నా

భావోద్విగ్నతలో నేనేం మాట్లాడానో గుర్తులేదు. 'నీరజక్కయ్యా నేను రంగశాయిని. అయిదారు వారాలుగా అమెరికాలోనే ఉన్నా. నిన్ను కలుసుకోవాలని శతవిధాలుగా ప్రయత్నించాను. ఇప్పుడెట్లాగో నీ నంబర్ దొరికింది. సోమవారమే తిరుగు ప్రయాణం. ఉన్న వ్యవధల్లా...'

ముక్కు బద్దలయ్యేటట్టు ముఖంమీద గుద్దానన్నట్టుగా 'వెరీ సారీ! రాంగ్ నంబర్' అంటూ నువ్వు ఫోన్ కట్టేశావు.

గొంతు మార్చుకోవడానికి విఫలప్రయత్నం చేశావులే. అప్పటికి నేనేనా నెల తక్కువగా పుట్టినవాణ్ణి 'నీకూ బెబ్బెబ్బే, నీ అబ్బకూ బెబ్బెబ్బే' అన్నట్టుగా నువ్వు నన్నుగూడా మభ్యపెట్టజూస్తున్నావని నాకు తెలిసిపోయింది.

అయినా సరే నా అమెరికా యాత్రకంతా ఫలశ్రుతిగా నీ అజ్ఞాతవాసానికి భంగం కలిగించి తీరాలన్న నిర్ణయానికి వచ్చేశాను.

'మహేష్‌బాబుగారూ. నూరు ఆరైనా, ఆరునూరైనా రేపు మనం ఓల్డ్ హైడ్ పార్క్ వెళ్ళిరావాలి' అన్నాను.

'ఓల్డ్ హైడ్ పార్కా! అదెక్కడుందో ఎరుగుదురా! ఆరేడు వందల మైళ్ళకు తక్కువుండదు. కారులో వెళ్ళిరావడం గురించి ఊహించలేము. ఫ్లైట్‌లో వెళ్ళాల్సిందే. గంటో, గంటన్నరో ఏరోడ్రోమ్‌నుంచి టాక్సీలోగూడా వెళ్ళాల్సి ఉంటుంది.

'ఫరవాలేదు. ఎంత ఖర్చయినా నేను వెనుదీయను. మీరు తోడుగా ఉంటే చాలు' నన్నాను. అమెరికా ఖండంలోని ప్రయాణ సదుపాయాలు అభ్యుదయ పరంపరాభివృద్ధిగా వర్ధిల్లుగాక. మరునాటి ఉదయం పదిగంటలకల్లా మేము ఓల్డ్ హైడ్ పార్కులో గ్రీన్ ఉడ్ డ్రైవ్ నం.69 ఇంటి ముంగిట నిలబడి కాలింగ్ బెల్ మోగించాను. ఆదమరచి ఉన్నావేమో, నువ్వు తటాలున తలుపు తెరిచి రెడ్‌హ్యాండెడ్‌గా నాకు పట్టుబడిపోయావు. 'నీరజక్కయ్యా ఇది నీకు న్యాయమేనా? నాపట్ల ఇంత నిర్దయ వహించడం నీకు తగునా' అంటూ నీ చేతులు పట్టుకున్నాను. కన్నీటి కొలకులైపోయిన కళ్ళల్లోనుంచి ఆ క్షణాల్లో నువ్వు నాకుగానీ, నేను నీకుగానీ స్పష్టంగా కనిపించి ఉండమేమో.

డగ్గుత్తికతో 'రండి, రండి' అంటూ లోపలికి దారి తీశావు.

కాఫీ కలుపుకొచ్చే మిషపైన నువ్వు వంటగదిలోకి తప్పుకున్నావు. నేను ఇల్లంతా కలయజూస్తున్నాను. గృహ వాతావరణంలో తెలియని వెలితి ఏదో నా మనసును స్పృశిస్తూ ఉంది. ముగ్గురుండవలసిన గ్రూప్ ఫొటోలో ఇద్దరినే చూస్తుంటే గుండెలో ముల్లు దిగినట్టయింది. నీతోబాటుగా ఫొటోకు దిగిన కుర్ర దొరసానిని రాధిక అనుకోవడానికి ఆధారాలేమీ కనిపించడం లేదు. మూడేళ్ళ చిట్టి రాధికతో నువ్వొకసారి స్వదేశానికి వచ్చావు గుర్తుందా అక్కయ్యా. అప్పుడు నేను వేణువుపైన సాధనలు చేస్తూ కృష్ణశాస్త్రి తిలక్‌లను అధ్యయనం చేస్తూ నిష్పూచీరాయణ్ణిగా ఉండేవాణ్ణి. ముద్దులొలికే రాధికను రెండు చేతులతోనూ పైకెగురవేసి పట్టుకుంటూ, 'రాధీ! నేను నిరపరాధీ! ఏనాడు మనకు షాదీ, ఆ నాడు మనకుగాదీ' అంటూ ముదలంకించుకునేవాణ్ణి.

'నా మాటలకేముందిగానీ, ఈ వృద్ధ వివాహానికి మీ బావగారొప్పుకుంటారేమిరా' అంటూ నువ్వు నవ్వేదానివి. మరైతే ఏరీ, ఆ బావగారు ఇప్పుడేరీ? 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు?'

కాఫీ ఇచ్చాక భోజనం సిద్ధం చేసే నెపంమీద నువ్వు మళ్ళీ వంట గదిలోకి జారుకున్నావు. కొద్దిపాటి పుణ్యకాలం అలాగే గడచిపోనివ్వకుండా నేనుకూడా నీ దగ్గరికి వచ్చి కూర్చున్నాను. ఇసుకలో నుంచి తైలం తీయవచ్చునంటారు. తీయవచ్చునేమోగానీ, అదెంత కష్టసాధ్యం? దాదాపు పదిహేనేళ్ళ తర్వాత వివాహ జీవితం విచ్ఛిన్నమైపోవడానికి కారణాలేమిటో నీనుంచి రాబట్టడం గూడా దుస్తరమైపోయింది. ఎట్లానో చూచాయగానైనా బయటపడ్డావు.

'ఎందుకులే రంగశాయీ? కంపెనీ ఉత్పత్తుల ప్రచారం కోసం ఏడాదికి రెండు మూడుసార్లు దేశాలు తిరిగే ఉద్యోగమైపోయింది. వెళ్ళిన ప్రతిచోటా ఏవో కొన్ని అఫైర్లు మామూలైపోయాయి. ఏంలేదు, అమెరికా కెలాగైనా రప్పించే పూచీ వహిస్తే చాలుగదా, వలలో పడడానికి సిద్ధం కానిదెవరు? వాళ్ళ ఉత్తరాలు, రాసక్రీడల ఫొటోలు కనీసం నాక్కనిపించకుండా చూడాలన్న ధ్యాసయినా లేకపోతే ఏం చెయ్యాలి? కొంపదీసి అలాంటి శాల్తీ ఒకటి కొద్ది మాసాల వ్యవధిపైన ఇక్కడికొచ్చేస్తే ఇక తిరుగుళ్ళ కద్దేముంది?

మాంసం తినొచ్చు. అభ్యంతరంలేదు. ఎముకల దండను మెడలో వేసుకుని అదొక గొప్పగా భావిస్తూ ఎదుటికొస్తే ఎలా భరించడం? మొదటి అయిదేళ్ళూ రథం ఒడిదుడుకులతోనే సాగినా సర్దుకున్నాను. రెండో అయిదేళ్ళతో పరిస్థితి విషమించింది. కించపాట్లను భరిస్తూ రాతిబొమ్మలా ఉండిపోయాను. మూడో అయిదేళ్ళలో శ్రుతిమించి రాగాన పడిపోయింది. ఆత్మాభిమానానికి అగ్నిపరీక్ష. ఈ నిర్ణయం తీసుకోవడం అనివార్యమైపోయింది. అదీ సంగతి. ఇంతకుమించి నన్నేమీ అడగొద్దు. అన్నపు మెతుకులే ఆరోగ్యప్రదమనుకోక, రత్నాలు బొక్కవచ్చుననుకుని పెళ్ళికి మునుపు ముఖపరిచయమైనా లేని వ్యక్తి వెంట ఇక్కడికి రావడమే నేను చేసిన ఘోరమైన తప్పిదమైపోయింది.

కష్టకాలంలో డిగ్రీ చదువు పనికొచ్చింది. ఎవరికీ తెలియకుండా నా ఏకాంత వాసంలో నేనుండిపోతూ, ఇలాగే చివికి కుంగి కృశించి, నశించిపోవడానికే జీవిస్తున్నాను.

ఒరేయ్ తమ్ముడూ, నీ పర్యటనానుభవాలను నువ్వొక యాత్రాచరిత్రగా రికార్డు చేస్తావు గదూ. అందులో దుఃఖభాజనమైపోయిన ఈ దీనురాలి జీవితానికి గూడా కొంచెం తావివ్వు. ఊరూ. పేరూ మాత్రం మారుస్తావు గదూ.'

ఏనుగుల సమూహం స్నానంచేసి వెళ్ళిన అడవి కొలనులా నా మనసంతా కలవరంతో నిండిపోయింది. ఎట్లాగో కొంతసేపటికి మానసిక శక్తులన్నింటినీ కూడ దీసుకుని, 'అక్కయ్యా, మరి... మరి రాధిక ఏదీ' అని ప్రశ్నించాను.

'ఫ్రండ్స్‌తో కలిసి నిన్న సాయంకాలమనగా వెళ్ళింది. ఎక్కడికి వెళ్ళిందో, ఎప్పుడొస్తుందో తాను ఫోను చేస్తేగాని తెలియదు. ఇట్లాగే ఎప్పుడైనా 'ఈ రోజు నేను ఫలానావాణ్ణి పెళ్ళి చేసుకున్నానమ్మా. ఒక అపార్ట్‌మెంట్ తీసుకున్నాం. వారాంతాల్లో నువ్వొచ్చిపోవచ్చు. మేమూ వీలయినప్పుడల్లా వస్తుంటాము' అని చెప్పడానికిగూడా ఫోనే ఉపయోగించుకుంటే ఆశ్చర్యపడవలసిందేమీ ఉండదు.

అప్పుడు నేను ఇంకా ఇంకా ఒంటరి దాన్నయిపోతాను. ఒక సమాజం నుంచి పూర్తిగా వేర్లను పెల్లగించుకుని, మరొక సమాజానికి తమ భావి జీవితపు ఆనందాలన్నీ

అప్పనంగా దఖలు పరచి ఈ త్రిశంకు స్వర్గంలో లక్షలాదిమంది విదేశీయ తల్లితండ్రుల్లా నేనూ తలకిందులుగా వేలాడుతూ ఉంటాను.

వాతావరణం విషాదంతో బరువెక్కిపోయాక, ఒకరి ముఖం ఒకరు తేరిపార జూసుకునే స్థయిర్యం మనకు లేకపోయింది. వీడ్కోలివ్వడానికి ముందుగా గుమ్మానికావల నిలబడి మౌనపు తెరను కాస్తా ఒత్తిగించుకుంటూ నువ్వడిగావు – 'తమ్ముడూ, రంగశాయీ, అమెరికా యాత్రకంతా సారాంశంగా ఒక మాట చెప్పమని మన దేశంలో ఎవరైనా అడిగితే నువ్వేం చెబుతావో తెలుసుకోవచ్చా?'

నీకు కొంచెం ఊరటగా ఉండాలనుకున్నానేమో తెలియదు. స్ఫురణకు వచ్చిన మాటలు కొన్ని వల్లించాను– 'అమెరికాలో నేను చాలా ప్రదేశాలు తిరిగాను. వెళ్ళిన ప్రదేశాలన్నింటా 'మీదే ఊరు' అని ప్రశ్నిస్తే, వాళ్ళిచ్చిన జవాబుల్ని బట్టి మన హైదరాబాదు, నిజామాబాదు, విశాఖ, విజయవాడ, తిరుపతి, అనంతపురం లాంటి నగరాలన్నీ అమెరికాకు వలస వెళ్ళిపోయినట్టు గ్రహించాను. వంశధార, నాగావళి, గౌతమి, కృష్ణ, పినాకిని లాంటి నదులన్నీ వెళ్ళివెళ్ళి మిసిసిపీలో కలిసినట్టు తోచింది. చూశారా, గ్లోబు గ్లోబంతా అరచేతిలోకి వచ్చేసినట్టు లేదూ?'

నీరసంగా నువ్వప్పుడన్నమాట నా చెవుల్లో ఇంకా మార్మోగుతూనే ఉంది.

'గ్లోబు అరచేతిలోకి వస్తే సరిపోయిందా? జీవితంలోకి ఆనందం రావద్దా'

❖ ఇండియా టుడే – 30 జూన్, 1998. ❖